# సన్మానం

కృష్ణమూర్తిగారు అచ్చం శ్రీకృష్ణమూర్తే - రంగుకు. అందం మాటేమైనా ఆయన చాలా మందం. బొంగురు గొంతు. అయినా గొంతెత్తి పాడుతాడు స్వేచ్ఛగా. కృష్ణమూర్తి కవి. ఏవేవో వచనకవితలంటూ పత్రికలకు రాసే వాడు. ఇప్పుడు సినిమాలకు పాటలు రాస్తు న్నాడు.

సినీ కవి కృష్ణమూర్తి శృంగార వర్ణనలకు చిలిపి కృష్ణుడే. ఆయన రాసక్రీడలు చేశాడో లేదో కానీ బాగానే రాశాడు. పిల్లలతో స్టేజిపై ప్రదర్శించి పెద్దలచేత చీవాట్లు తిన్నా, అవే సీన్లు సినిమాల్లో పెడితే యమ హిట్టయినై.

ఓ పాటలో -

"నారీ నారీ నడుమ మురారీ

హరికీ హరికీ నడుమ వయారీ-"

అదే పల్లవి ఉంచి చరణాలు మాత్రం మా ర్చాడు. స్వంతం - సొంతం ఏ పాటా రాయడు. పాత పాటల బాణీలకు, పాదాలకు - పదాలు మార్చి, కూర్చి, పేర్చి రాసి అద్భుతంగా రక్తికట్టి స్తాడు.

"కుందరదనా - అరవింద నయనా!"

అనే యక్షగాన దర్వును మార్చి

"కుందరదన అరవింద నయన



మద మందగమన

మృదు సుందర వదనా - వందనం..."

అని అతడు పాటరాస్తే అది హిట్ లిస్టు కెక్కింది. అలాంటి వెన్నో... అలా అలా ఆయన పాపులర్ సినీ కవి అయ్యాడు.

✧ ✧ ✧

ఓ పాటకు ఆయన్ని కాళిదాసు అన్నారు. వ్యాసుని శకుంతలకు కాళిదాసు వయ్యారాలు నేర్పితే, కృష్ణమూర్తి క్యాబరే డ్యాన్సు చేయిం చాడు. ఇంకా దుష్యంతునితో బ్రేక్ డ్యాన్స్! ఆ సీను ఓ పిక్చర్‌లో పెడితే సెన్సార్ బోర్డ్ వాళ్ళు కత్తిరించేశారు కాని, అలాగే ఉంచితే ఎంత సెన్సేషన్ అయ్యేదో.

శ్రీరామునితో బ్రూస్లీవలె కరాటే ఫైట్స్ చేయించే ఆలోచన ఉంది. అందుకు ఏ దర్శకు డూ నిర్మాతా ఇంకా ముందుకు రాలేదు.

అతని పాటల పదాలు, భావాలూ వినూ త్నాలే.

కళ్ళతో తాగిస్తాడు. ముక్కుతో తినిపిస్తాడు. పగలు చంద్రున్ని, రాత్రి సూర్యున్నీ చూపిస్తాడు. అర్థహీన పదాల సృష్టిలో అతడు దిట్ట. ఆ పదా లు మాండలికం అంటాడు కాని, అవి ఏ ప్రాం తం వారికీ అర్థంకావు.

ఆలీ - చేట, బ్రహ్మానందం - ఎంకమ్మ, బాబూమోహన్, మోహన్‌బాబు ఊతపదాలు ఆయన సృష్టించినవేనట.

అప్పటికి పుట్టలేదు, పుట్టినా కలం పట్ట లేదు కానీ, 'అపనా తనామనా-' 'తస్సాదియ్యా' రేలంగి మాటలూ తనవే అనేవాడు మన కృష్ణ మూర్తి.

✧ ✧ ✧

ఆ మధ్య కృష్ణమూర్తి రాసిన ఒక 'బాల గీతం' టి.వి.లో ప్రసారమైంది. పిల్లల అభినం దనల లేఖలు, ఫోన్‌కాల్స్ చాలా వచ్చినై. ఓ రోజు ఫోన్ కాల్ వింటూనే మనసులోని మాట పైకే అనేశాడు.

"మీ వాయిస్ చాలా బాగుందండీ!" అని.

"వయసు కూడా బాగానే ఉంది లెండి" జవాబు.

"ఎంత? ముప్పయ్ ఉంటారా".

"ఎనభై!" ఖంగుతిన్నాడు సమాధానం విని.

"పిల్లలమూ - మరు మల్లెలమూ! బాల గీతం మీదే కదండీ?"

"అవునండీ! నచ్చిందా? ఈ మధ్యే ఒక వృద్ధ గీతానికీ ఆఫర్ వచ్చిందండీ" సంతోషంగా చెప్పాడు.

"ఏమని రాస్తారు? త్వరగా చావండనా?"

"ఏమండీ అలా అంటారు?"

"నీ బాలగీతంలో ఏం రాశావయ్యా?"

'ముసలి వాళ్ళారా త్వరగా పోండి

పసివాళ్ళదే ఈ ప్రపంచమండీ' అనేనా?"

"వాళ్ళు అలాగే రాయమన్నారండీ..." మెల్ల గా అన్నాడు.

"ఎంత కూలి రచయితవైనా ఈ జాతిని, నీతినీ మరచిపోకు. నీ పాట పాడుతూ నా మనుమలు నన్ను ఆట పట్టిస్తున్నారు. మీ యిం ట పెద్దవాళ్ళెవరూ లేరా నాయనా? ఉండి ఉం దరు. ఉంటే ఇలాంటి పాట రాసేవాడివి కాదు. పాపులర్ సినీ కవివట కదా నువ్వు. ఏం పాట

డా॥ మలయశ్రీ

లివి? అన్నీ బూతు మాటలు. ఎందుకయ్యా ఆ సంపాదన?"

కృష్ణమూర్తి నోట మాట రాలేదిక. స్తబ్దు దయ్యాడు. బహువచనం నుంచి సంబోధన ఏకవచనానికి మారినప్పుడే సగం చచ్చాడు. ఈ అభిశంసకు పూర్తిగా చచ్చాడు. ప్రశంసలకు అలవాటు పడ్డ ప్రాణి. పాపం! కృష్ణమూర్తికి తలకొట్టేసినంత పని అయ్యింది.

ఆమె ఫోన్ పెట్టేసింది. ఆమె పేరేమిటో, ఊరేమిటో ఇతడు అడుగలేదు, ఆమె చెప్పలేదు.

✧ ✧ ✧

ఇటీవల విడుదలై విజయవంతంగా ప్రదర్శించబడుతున్న "ఆదర్శ ప్రేమ" సినిమాకు కృష్ణమూర్తి పాటలే కాదు, మాటలూ రాశాడు. కథ కూడా అతడు సమకూర్చిందే. అదేమంటే-

యజమాని కూతుర్ని పనిపిల్లవాడు ప్రేమించడం. పాతాళ భైరవి, మూగమనసులు, చంటి... కథలు అవే కదా. ఇదీ అంతే - కొత్త సీసాలో పాత సారా. అయితేనేం! చిత్రం ఘన విజయం సాధించింది. ఇక కృష్ణమూర్తి గారికి ఆఫర్లే ఆఫర్లు. సన్మానాలే సన్మానాలు. గొర్రె దాటు తనం కదా.

✧ ✧ ✧

సిటీ ఆదర్శ మహిళా సంఘం వారు ఈ సినీ మహాకవి కృష్ణమూర్తిగారికి ఓ రోజు అభినందన సభ ఏర్పాటు చేసి ఆహ్వానించారు. అంతకంటే కావల్సిందేముంది కవులకు? ఆనందంగా ఆమోదించాడు కృష్ణమూర్తి. అభిమానులతో సహా వెళ్ళాడు సభకు. ఆయన భార్య రాలేదు. ఆయన ఏ సభలకూ ఆమె వెళ్ళదు. ఆమె పొట్టి. అందుకే వెళ్ళదో, మరే కారణమో తెలియదు.

సభ ఏర్పాట్లు ఆర్భాటంగా జరిగాయి. అందులో ఆడవాళ్ళే ఎక్కువ. అతివలు ఉన్న చోట అందానికేం తక్కువ? పట్టు చీరెలు, నగలు, పూలు - తళతళలు, సువాసనల గుభాయింపులు.

వక్తలు సంచలన సినీకవి కృష్ణమూర్తిగారి సినిమా పాటలనే సమీక్ష కావించారు.

"నీ పెదవులు చికెన్ రోస్టు పీసులు
నేను టేస్టు చూడనా,
నీ పాదాలు బంగారు పద్మాలు
నే కోసి అమ్ముకోనా -

అలా ఓ పాట. ఇలా మరొకటి...

"మిస్సు మిస్సు మిస్సు
కిస్సు కిస్సు కిస్సు
మిస్సూ ఓ మిస్సూ
మిస్సు కానీయకు నా కిస్సు -

ఇదీ మన సినీకవి గారి అద్భుత సాహిత్య సృష్టి.

ఎంతదిగజారిగా ఇంత చౌకబారు పాటలు - మాటలు మన తెలుగు సినిమా రంగంలో ఇంతవరకూ ఎప్పుడూ లేవు.

అయ్యా! మీ సంపాదన సరే. కాస్త సమాజం దిక్కు కూడా చూడండి. అది హెచ్చరించడానికే ఈ అభినం దన సభ" అని సభాధ్యక్షురాలు కృష్ణమూర్తి గారిని ఉతికి ఆరేసి, కుర్చీనిండుగా కూర్చుంది.

ఇంతలో కృష్ణమూర్తి సెల్‌ఫోన్ మ్రోగింది. అది ప్రొడ్యూసర్ గొంతు.

"నమస్కారం సార్! సభకు వస్తున్నారా?"

"ఏం రావటమో... వద్దంటే ఓ ఛండాలపు కథ సినిమా తీయిస్తిరి" కోపంగా అన్నాడు

నిర్మాత.

"సక్సెస్ అయ్యింది కదండీ. పది సెంటర్ల లో శతదినోత్సవాలు గ్యారెంటీ" వినయంగా అన్నాడు మూర్తి.

"సినిమా సక్సెస్ అయింది నిజమే. ఇంటనే ఫెయిల్యూర్ స్టోరీ. నా కూతురు మా అసిస్టెంటు మేనేజర్‌ని పెళ్ళి చేసుకొని వచ్చింది".

"అసిస్టెంటు మేనేజరే కదండీ... మంచి కుర్రాడు."

"ఆఫీసు బాయ్‌ని నమ్మకస్తుడని సీటుపై కూర్చోబెట్టానయ్యా... పరువు బజారుకీడ్చాడు. ఏమిటో అంతా..."

"మరో మంచి కథ రాసిస్తానండీ... బాధ పడకండి".

"ఇంకానా? ఇక నేను సినిమాలు తీయను. తీసినా తమరిని మాత్రం రచయితగా పెట్టుకోను".

"ఎవరండీ – మీ సినిమా నిర్మాతగారా? ఏమంటున్నాడు?" సభా నిర్వాహకురాలు అడిగింది.

"సభకు రావటానికి ఆలస్యమవుతుందట".

"నేను మీ సంభాషణ అంతా విన్నానండీ".

ఏడ్వలేక నవ్వు ముఖం పెట్టాడు కృష్ణమూర్తి. మళ్ళీ ఫోన్. ఈసారి లేచి దూరంగా వెళ్ళాడు.

"ఇంకా అక్కడే తగలడ్డారా?" భార్య గొంతు.

"ఏమిటా రుసరుస?"

"మన అమ్మాయి ఇంటికి రాలేదింకా" చావు కబురు చల్లగా చెప్పింది.

షాక్ తిన్నాడు కృష్ణమూర్తి. అతని సిక్స్త్ సెన్స్ వేగంగా పనిచేసింది. "నా అసిస్టెంట్ కుర్రాడున్నాడా?" మనసులోని అనుమానం పైకే అనేశాడు.

"అదా సంగతి? ఇదంతా మీకు ముందే తెలుసన్న మాట!"

"హలో హలో–" ఫోన్ కట్.

కవిగారి ముఖం వెలవెల పోయింది.

అంతవరకూ సభావేదికపై అతిథులు ఎవరెవరో ఏదేదో మాట్లాడుతున్నారు. అవి పొగడ్తలో తెగడ్తలో కవిగారు వినలేదు. అతనికి అప్పటికే సన్మాన ఉత్సాహం పోయింది.

"మీ ప్రసంగం..." అంది సభాధ్యక్షురాలు.

"నేను వెళ్ళాలమ్మా" అన్నాడు కృష్ణమూర్తి.

"మీకు సన్మానం...?" సభా నిర్వాహకురాలి మాట.

"ఏదీ వద్దండీ" వేదిక దిగి ఇంటిదారి పట్టారు ప్రముఖ సినీకవి కృష్ణమూర్తిగారు. ●

## బ్రెయిన్ టీజర్స్

### ఆకలి

పిల్లి, ఎలుక కలిసి హోటల్‌కి వెళ్ళాయి. ఎలుక తనకో చికెన్ సూప్, మటన్ చాప్స్ ఆర్డర్ చేసింది.

"పిల్లికేం కావాలి?" అడిగాడు వెయిటర్.

"ఆ మాత్రం తెలీదా? దానికి ఆకలిగా లేదు" అంది ఎలుక.

ఎలుక చెప్పింది కరక్టే. ఎలుకకి తెలిసిన సంగతి ఆ వెయిటర్ ఎందుకు తెలుసుకోలేకపోయాడు?

పిల్లికి ఆకలిగా ఉంటే ఎలుకతో హోటల్‌కి వచ్చే బదులు దాన్ని తినేసి ఉండేది కాబట్టి.